

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు



సంపుటి : 27 | సంచిక : 9 | మే 2022

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

కాలం విలువ - సాధన .......... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు .......... 4

శ్రీమద్భగవద్గీత .......... 15

అక్షరమణమాల .......... 19

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



ఆత్మానుభవం కలగటానికి నీకు ఏ సంస్కారాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి తగిన శక్తిని, శ్రద్ధని, విశ్వాసాన్ని నీలో కలిగింపజేసి నీలో ఉన్న బలహీనతలను తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నానికి సహాయసహకారములు అందించేవాడే గురువు.

# కాలం విలువ - సాధన

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

నారాయణుడు కాల స్వరూపంలో ఉన్నాడు. అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

నారాయణుడు కాల స్వరూపంలో ఉన్నాడు. కాలాన్ని మీరు గౌరవించకపోతే నారాయణుడిని అగౌరవపరచినట్టు లెక్క. అందుచేత మీరు కాలాన్ని దుర్వినియోగం చేసుకోకండి. డబ్బు పోతే మళ్ళీ సంపాదించగలం. మన దగ్గర పదిరూపాయలు పోతే మళ్ళీ సంపాదించగలము కానీ కాలం ఖర్చు అయిపోతే తిరిగి సంపాదించలేము. ఇప్పుడు మనకి డబ్బై ఏళ్ళు అనుకోండి, ముప్పైయవ సంవత్సరం మళ్ళీ రమ్మంటే రాదు. కాలం వెనక్కి వెళ్ళదు కదా. చెరువులో నీళ్ళు బయటికి వెళ్ళిపోతే, మళ్ళీ కష్టపడి చెరువులో నీళ్ళు పెట్టుకోవచ్చు. కానీ కాలం అలా కాదు, వెళ్ళిపోయిన కాలం మళ్ళీ వెనక్కి రాదు. అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోండి.

ఒక ఫ్రెంచి రచయిత రాసిన పుస్తకంలో ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావటానికి రెండు సూచలను ఇచ్చాడు. అందులో, ఏడు సార్లు పడిపోతే ఎనిమిది సార్లు లేవండి అన్నాడు. సాధన చేసేటప్పుడు పడిపోతూ ఉంటారు. సిద్ధి కలిగేవరకూ, ఆత్మసాక్షాత్కారం కలిగేవరకూ, ఆత్మ దర్శనం కలిగేవరకూ సాధనలో పడిపోతూ ఉంటారు. మంచిగా ఉందాము అనుకొంటారు, పడిపోతారు, మళ్ళీ మంచిగా ఉందాము అనుకొంటారు, మళ్ళీ పడిపోతా ఉంటారు. మీరు ప్రయత్నం చేసినా ఫెయిల్ అవుతూ ఉంటారు. మనం ప్రయత్నం చేస్తున్నాము, కానీ ఎందుకో కలిసి రావటం లేదు, సాధన సక్సెస్ అవ్వటంలేదు అని మొత్తానికి మానేయకండి. ఎన్నిసార్లు పడిపోతే మళ్ళీ అన్నిసార్లు లేవండి. సాధన విడిచిపెట్టొద్దు. సాధన చేయకుండా సిద్ధి కలుగదు. ఏడుసార్లు పడిపోతే ఎనిమిదిసార్లు నిలబడండి అని భక్తులకి చెప్పాడు ఆ రచయిత.

ఆయన ఇంకో మాట చెప్పాడు, అది కూడా నాకు నచ్చింది అన్నారు నాన్నగారు. మీ బుద్ధి మీ జేబులోనే పెట్టుకోండి, ఎవరికీ ఇచ్చేయకండి అని. రోజులు మంచివి కాదు, ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియదు. కొంతమంది మంచి స్వభావము లేని వాళ్ళు కూడా చాలా మంచి వాళ్ళ కింద కనిపిస్తారు. మీకు తెలియక మీ బుద్ధిని మీ జేబులో పెట్టుకోవటం మానేసి వాళ్ళ జేబులో పెట్టినట్లైతే జీవితంలో సర్వస్వం కోల్పోతారు. ఎదుటి వాళ్ళు చెప్పేది వినండి, అందులో మంచి ఉంటే స్వీకరించండి, లేకపోతే వదిలేయండి. మీకు

వివేకం లేకుండా, వాడు ఏది చెపితే అది నమ్మేలా ఉండొద్దు. వాడి మాటలు విని జల్లెడ పట్టండి. ఇందులో మనకి ఏ మాటలు ఉపయోగపడతాయి, ఏ మాటలు ఉపయోగ పడవు. ఇందులో ధర్మం కోసం ఎన్ని మాటలు చెప్పారు, మన మంచి కోసం ఎన్ని మాటలు చెప్పారు, మనకి ఉపయోగం లేని మాటలు ఏమైనా ఉన్నాయా అని మీ బుద్ధిని మీ జేబులో పెట్టుకొని, ఆలోచించుకొని, మంచి ఉంటే స్వీకరించండి, చెడ్డ ఉంటే వదిలేయండి. అంతే కానీ మీరు మొత్తానికి తీసుకెళ్లి మీ బుద్ధి ఎవరో ఒకరి జేబులో పెట్టేస్తే, జీవితంలో భౌతికంగా నష్టపోతారు, ఆధ్యాత్మికంగా నష్టపోతారు. ఎవరైనా' చెపితే వినండి, కానీ మీ బుద్ధితో మీరు ఆలోచించుకోండి. దాని వల్ల మీకు తెలివితేటలు పెరుగుతాయి. జీవిత విధానం బాగుపడుతుంది. అందుచేత ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండండి. మీకు డబ్బు ఉంటే పదిరూపాయలు ఎదుటివాళ్లకి ఇవ్వచ్చు, పదిమందికి అన్నం పెట్టాలంటే పెట్టొచ్చు, అంతేకాని మీ బుద్ధి మట్టుకు ఎవరికీ ఇచ్చేయకండి. మీరు వినండి, ఈ మాటలు మన మంచి కోసం చెపుతున్నారా, చెడ్డ కోసం చెపుతున్నారా, అని మీరు జాగ్రత్తగా పరిశీలన చేసుకోండి.

తరువాత, ఎక్కడా ఏ వ్యాపారంలో కూడా స్లీపింగ్ పార్టనరుగా ఉండొద్దు. అంటే ఎక్కడోచోట మీరు పెట్టుబడి పెట్టేసి, మనకి వాళ్ళు లాభాలు పంచిపెడతారు అనుకోవద్దు. రోజులు మంచివి కాదు. రామరాజ్యంలో ఇచ్చేవాళ్లు ఉండేవారు కానీ పుచ్చుకునేవాళ్ళు ఎవరూ ఉండేవారు కాదట. అలా ఇప్పుడు రామరాజ్యం ఉందనుకోవద్దు. కాలాన్ని బట్టి నడుచుకోండి. మీకు బుద్ధి ఇచ్చాడు కదా, మీ బుద్ధితోటి ఆలోచించి ఎవరికైనా మంచి మాట చెప్పాలంటే చెప్పండి. అంతేకాని మీ డబ్బు అంతా తీసుకెళ్లి వాడి జేబులో పెట్టొద్దు. మీకేదైనా సహాయం చెయ్యాలంటే చేయండి. దానికొక పద్ధతి నేర్చుకోండి, లేకపోతే మీరు సుఖపడరు. మీరు మొత్తం మీద ఎవడినో నమ్మేసి, మీరు పూర్తిగా మీ బుద్ధి అంతా వాడి జేబులో పెట్టేస్తే, మొత్తం మీద మీరు సర్వస్వం కోల్పోయే పరిస్థితులు మీకు వస్తాయి అని ఆ ఫ్రెంచ్ రచయిత చెప్పాడు.

మీ బుద్ధి మీ జేబులో పెట్టుకోండి. సాధన చేస్తుంటే, మీరు ఏడు సార్లు పడిపోతే, ఎనిమిది సార్లు లేవటం నేర్చుకోండి. ఈ రెండూ నాకు నచ్చినవి కాబట్టి, భక్తులైన మీకు ఏమైనా నిత్యజీవితంలో ఉపయోగపడతాయేమో అని చెపుతున్నాను. అంతేకాని కాలక్షేపానికి కాదు అన్నారు నాన్నగారు. ఇది కాలక్షేప సంఘం కాదు ఆధ్యాత్మిక సంఘం. అంటే చైతన్య స్థాయి పెంచే సంఘం. మీ చైతన్యస్థాయి పెరగాలి. ఈ రోజు నాన్నగారి మీటింగులో ఒక్క మంచి విషయం అయినా నేర్చుకున్నామా, నేర్చుకోకుండా వచ్చేశామా, అని మీలో మీరు ప్రశ్నించుకోవాలి.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 18 ఆగష్టు 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీరు ఒకటి గుర్తుంచుకోండి నిజమైన గురువు ఆత్మవిచారణకే మనలని తీసుకు వెళ్తూ ఉంటాడు. మనం ఆత్మవిచారణ చెయ్యటం లేదు అనుకోండి, ఆత్మను గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యటం లేదు అనుకోండి, ఆత్మ గురించి మననం చెయ్యటం లేదు అనుకోండి, ఆత్మ గురించి శ్రవణం చెయ్యటం లేదు అనుకోండి అప్పడు మనం లోక విచారణ చేస్తున్నట్టే లెక్క. ఉన్నది ఒక్కటే ఆత్మ, మిగతాది అంతా జడం. మన శరీరం జడం, మన మనస్సు జడం, మన అహంకారం జడం, మన ఇంద్రియాలు జడం. ఇప్పడు మనం ఇక్కడ కూర్చున్నాము, నేను మీ అందరి వంక చూస్తున్నాను. మీరు నాకు కనిపిస్తున్నారు, సూర్యుడి వెలుతురు లేదు అనుకోండి మీరు ఎవరైనా నాకు కనిపిస్తారా? సూర్యుడు అస్తమించాడు అనుకోండి, అప్పడు మనకు వెలుతురు కావాలి. లైటు పెట్టుకుంటాం, మీరు అందరూ నాకు కనిపిస్తారా? లేదా? కనిపిస్తారు. ఇప్పుడు సూర్యుడి వెలుతురు వల్ల కనిపిస్తారు, అప్పుడు ట్యూబ్ లైట్ వేసుకుంటే మీరు అందరూ కనిపిస్తారు. ట్యూబ్ లైట్ లేదు, సూర్యుడి యొక్క వెలుతురు లేదు అనుకోండి మీరు నాకు కనిపిస్తారా? ఉన్నారు ఉండటం కానీ మీరు ఎవరూ కనపడరు. అంటే మిమ్మల్ని చూడటానికి నాకు వెలుతురు సహాయం అవసరం. అంటే వెలుతురు లేకపోతే మీరు ఇక్కడ కూర్చున్నప్పటికీ నేను మిమ్మల్ని చూడలేను. అయితే నేను ఉన్నాను అని నాకు తెలియటం కోసం సూర్యుడి వెలుతురు నాకు అక్కర్లేదు. దీపం వెలుతురు నాకు అక్కర్లేదు.

రాత్రి నిద్రట్లో మెలకువ వస్తుంది అనుకోండి. మెలకువ వచ్చినప్పుడు నేను ఉన్నాను అని మీరు తెలుసుకోవడం కోసం ట్యూబ్ లైట్ లేకపోతే మీకు తెలియదా? నేను ఉన్నాను అని నాకు తెలియటం కోసం ట్యూబ్ లైట్ అక్కర్లేదు. సూర్యుడి వెలుతురు అక్కర్లేదు. అంటే నేను స్వయంగా ప్రకాశిస్తున్నాను చీకట్లో కూడా, అందుచేత ఆత్మ స్వయం ప్రకాశి. మరణం అంటే మన అందరికీ భయం వేస్తుంది ఎందుచేత? దాని గురించి మనకి తెలియదు కాబట్టి ఈ రూపం, ఈ నామం, ఇదంతా లోకానికి సంబంధించినది. మనకి రూపం వచ్చింది దానికొక పేరు పెట్టారు. ఈ రూపాన్ని, నామాన్ని తీసేయండి మీరు లోకం ఎక్కడైనాఉందేమో చూడండి. మనకి తల్లి కడుపు లోంచి ఒక రూపం వచ్చింది దానికి ఒక పేరు పెట్టారు. మనల్ని ఆకర్షించేది, మోహంలో పెట్టేది, అజ్ఞానంలో పెట్టేది, రూపమే!

ఆ రూపానికి ఒక పేరు పెట్టారు. అంటే మనం మరణించిన తరువాత మనకిఅస్థిత్వం ఉండదేమో అనుకుంటున్నాం. మరణించిన తరువాత అస్థిత్వం ఉంటుంది. అంటే మరణించటం వల్ల ఏమవుతుంది? రూపం మారుతుంది, నామం మారుతుంది. దేహం మరణిస్తుంది. దేహం మరణించినపుడు ఇంకొక దేహం వస్తుంది, అంటే రూపం మారుతుంది. రూపం ఎప్పుడైతే మారిందో పేరు మారుతుంది. అంటే లోకం వచ్చేటప్పటికి లోకానికి సంబంధించిన ఒక రూపం ఉండాలి, పేరు ఉండాలి. మీకు రూపం లేకపోతే, పేరు లేకపోతే లోక వ్యవహారం నడవదు. మీరు రూపం తీసేయండి. నామం తీసేయండి. లోకం ఎక్కడ ఉందో చూడండి. ఉన్నది ఒక్కటే వస్తువు ఆత్మ వస్తువు. మరి నేను ఎవరిని? ఆత్మ గురించి శ్రవణం చెయ్యమన్నారు. ఎందుచేత శ్రవణం చెయ్యమన్నారు? అది మీరే.

నా మాయని ఎవరు అతిక్రమించలేరు అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఆవరణ శక్తి, విక్షేప శక్తి అని రెండు శక్తులు ఉన్నాయి. ఆవరణ అంటే మరుగు పరుస్తుంది. నేను ఆత్మని అన్న సంగతి నా అనుభవంలోకి రాకుండా ఆపేది ఆవరణ శక్తి. నేను ఆత్మను అయినప్పటికీ, అది నా అనుభవంలోకి రాకుండా అది మరుగు పరుస్తుంది. అంటే అది కమ్మేస్తుంది. సూర్యుడిని మేఘం ఎలా కమ్ముతుందో, అలా ఆవరణ నన్ను కమ్ముతుంది. నా స్వరూపాన్ని కమ్ముతుంది. ఇది మాయ యొక్క శక్తి. నామ రూపాల మీద భ్రాంతి కలగడంవిక్షేపానికి సంబంధించినది.

ఈ అహంకారం అంటే మీరు సామాన్యం అనుకోకండి. అది ఏనుగు లాంటిది. ఈ ఏనుగు సింహానికి లొంగుతుంది కానీ మామూలు లొట్టి పిట్టలకి లొంగదు అని భగవాన్ చెప్పారు. అంటే సింహం ఎవరు? గురువు యొక్క కటాక్షం, శాస్త్రం యొక్క కటాక్షం, ఈశ్వరుడి యొక్క కటాక్షం, అది సింహం అంటే! నేను కర్తను అనే భావన వచ్చినప్పుడు దానిని అహంకారం అంటారు. మన బుద్ధే చేస్తుంది ఆ పని, మరి ఆ బుద్ధి ఏమి చేస్తుంది? ఇంద్రియాల ద్వారా బయటకి వచ్చి లోకంలో ఏమి జరుగుతుందో గ్రహిస్తుంది. అది ఇంద్రియాల ద్వారా బయటకి వచ్చి విషయాలను గ్రహించినప్పుడు మనస్సు అంటున్నారు. అంతఃకరణం అంటున్నారు. ఇది నేను చేస్తున్నాను అనే భావన దానికి వచ్చినప్పుడు అహంకారం అంటున్నారు. మీకురాత్రుళ్ళు కలలు వస్తాయి. ఎక్కడికో వెళ్లినట్టు, ఏదో చూసినట్టు, ఎక్కడికో ప్రయాణం చేసినట్టు కల వస్తుంది. ఆ కలలు ఎవరు సృష్టించారు? మీ వాసన సృష్టిస్తుంది. కలలో మీరు సుఖం అనుభవించినా, దుఃఖం అనుభవించినా, ఆ కల ఎవరికి? మీ వాసనకి. భౌతిక పదార్థాలు నాకు కనిపిస్తున్నాయి. నా కళ్లకు ఎంజాయ్ చెయ్యడానికి వస్తువులు కనిపిస్తున్నాయి. ఈ

వస్తువులు అన్నీ ఎవరికి? నా వాసనకి. లోకంలో పదార్థాలు అన్నీ ఎవరి కోసం? నా వాసన కోసం. ఈ విశాలమైన ప్రపంచంలో అందరూ ఒకే పని చేస్తున్నారా? చెయ్యటం లేదు. ఎవరి వాసన బట్టి వాళ్ళు ఆ పని చేస్తున్నారు.

అంటే ఎవరి వాసన బట్టి వాళ్ళకి సత్సంబంధమైన భోగం వస్తుంది అని ఆ పని చేస్తున్నారు. భోగం అంటే ఏమిటి? నీ ఇంద్రియాల తోటి నువ్వు పొందే అనుభవాన్ని భోగం అంటారు. ఆ భోగం కోసం మనం డబ్బు సంపాదిస్తాం. డబ్బు లేని వాడికి భోగం ఎక్కడ నుంచి వస్తుంది? మనం జీవిస్తున్న జీవితం మనస్సుకి, రాత్రి మనకి వచ్చే స్వప్నాలు మనసుకి, గాఢనిద్ర కూడా మనస్సుకే. మీకు నిద్రలో విశ్రాంతి కూడా మీ మైండ్‌కే. అయితే మూడు అవస్థలు ఎవరికి? స్వప్నావస్థ ఎవరికి? మైండ్‌కే. రాత్రి వచ్చే కలలు అన్నీ మనస్సుకే. గాఢనిద్ర ఎవరికి? మనస్సుకే. మనకళ్ళతో చూస్తున్న ప్రపంచం ఎవరికి? మనస్సుకే. మనస్సు ఉంది కాబట్టి ప్రపంచాన్ని ఎంజాయ్ చేస్తాం. మనస్సు లేని వాడికి ప్రపంచం కావాలా? అంటే నీకు వేరుగా నువ్వు ఏది అనుభవించినప్పటికీ నువ్వు ఆత్మ కాదు. నీకు వేరుగా ఏది చూస్తున్నప్పటికీనువ్వు ఆత్మ కాదు. మనకి కోపం వస్తుంది. ఎవరికి కోపం వస్తుంది? నాకు కోపం వస్తుంది. అంటే అహంకారానికి వస్తుందా? ఆత్మకి వస్తుందా? నేను ఆత్మనా? లేకపోతే అహంకారాన్నా, అంటే నేనొక వ్యక్తిని అనుకుంటున్నాను కాబట్టి నాకు కోపం వస్తుంది. వ్యక్తి అంటే ఎవడు ఇక్కడ? అహంకారం. అహంకారం పరిమితం చేస్తుంది. దేనికి పరిమితం చేస్తుంది? శరీరానికి పరిమితం చేస్తుంది. అంటే నేనొక వ్యక్తిని అనుకుంటున్నాను కాబట్టి నాకు individual sense వస్తుంది. నాకు వ్యక్తి భావన ఎప్పుడు వచ్చిందో అప్పుడు కోపం వస్తుంది. నాకు కోపం వస్తుంది అది నాకు కనిపిస్తుంది. కనిపించేది ఆత్మ ఎలా అవుతుంది? కోపమే కాదు. మీకు ఏ కోరిక వచ్చినా, మీకు కనిపిస్తుందా, లేదా? కోరిక ఎక్కడ వస్తుంది? మనసులో వస్తాయి కోరికలు. మనసులో

**మంచిగా జీవించటం కంటే మించిన తపస్సు లేదు. జీవితం పొడుగునా మంచిగా జీవించేవానికి మనస్సు యొక్క పొరలలో దాగి ఉన్న దోషాలు రాలిపోయి, జ్ఞానం వైపుకు దారి కనిపిస్తుంది.**



ఈ కోరిక వస్తుంది అన్నప్పుడు మీకు కోరిక కనిపిస్తుందా, లేదా? అంటే కోరికని మీరు చూస్తున్నారా, లేదా? ఇప్పుడు నాకు ఈ కోరిక వచ్చింది అని మనసుకి వేరుపడి మీరు చూస్తున్నారా, లేదా? ఆ చూసేవాడు ఎవడు? మీకు మంచి కోరికలు రావచ్చు, చెడ్డ కోరికలు రావచ్చు. ఆ కోరికలని మీరు చూస్తున్నారా, లేదా? ఆ చూసేవాడు ఎవడు?

మనిషి పాపం చెయ్యడానికి ఒక్కటే కారణం. ఈ జన్మలో కానీ, పూర్వజన్మలో కానీ, రాబోయేజన్మలో కానీ ఒక్కటే కారణం. దేహమే ఆత్మ అనుకున్నంతకాలం మనిషి పాపం చేస్తూనే ఉంటాడు. అందుకే నువ్వు పాపాన్ని దాటు, పాపాన్ని అతిక్రమించు అని వేదాలలో చెప్పారు. అయితే మనిషి పాపం చేస్తూనే ఉంటాడు. ఎంతకాలం పాపం చేస్తూ ఉంటాడు? తన అస్థిత్వాన్ని దేహానికే పరిమితం చేసినంత కాలం, నేను దేహ మాత్రుడనిఅని తానుఅనుకున్నంత కాలం మనిషి పాపం చెయ్యడం మానడు. నేను ఆత్మని కానీ మీరు ఏమి అనుకుంటున్నారు? దేహన్ని అనుకుంటున్నారు. అందుచేత దేహం మరణించినప్పుడు నేను మరణిస్తున్నాను అనుకుంటున్నాను. దేహం జన్మించినప్పుడు నేను జన్మించాను అనుకుంటున్నాను. అంటే ఏమిటి? ఆత్మని ఈ దేహానికి పరిమితం చేసేశాను. దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాను. దేహాన్ని ఆత్మ అనుకునే బుద్ధి ఎంతకాలం అయితే ఉందో, అంతకాలం వాడు పాపం చేసి తీరతాడు. ఎంతకాలం ద్వైత బుద్ధి ఉందో అంతకాలం వాడికి సందేహాలు వస్తూనే ఉంటాయి. అనుమానాలు వస్తూ ఉంటాయి. ఎంతకాలం ద్వైతబుద్ధి ఉందో అంతకాలం వాడికి కోపం పుడుతుంది, కామం పుడుతుంది. తనకంటే వేరుగా వస్తువు ఉండేటప్పటికి కాంక్ష కలుగుతుంది. తనకంటే వేరుగా వస్తువు లేనప్పుడు కాంక్ష ఎక్కడ నుంచి వస్తుంది? మీకు ద్వైతబుద్ధి ఉంది అనుకోండి ఇప్పుడు, తాత్కాలికంగా మీరు అణిగి ఉన్నప్పటికీ మీకంటే వేరుగా వస్తువు కనిపిస్తున్నంత కాలం ఎప్పుడో ఒకప్పుడు మీకు కోరిక కలుగుతూనే ఉంటుంది. ఎవడు ధీరుడు? ఎవడు ధీరుడు అంటే ఎవడైతే తన బుద్ధిని అంతర్ముఖం చెయ్యగలుగుతున్నాడో వాడే ధీరుడు. ధీరుడు అంటే మనుషులని చంపేవాడు ధీరుడు కాదు. జంతువులని చంపేవాడు ధీరుడు కాదు. ఎవడైతే తన బుద్ధిని అంతర్ముఖం చెయ్యగలుగుతున్నాడో వాడే ధీరుడు.

మాకు మీ అనుగ్రహం కావాలి అని భగవాన్‌ని ఎవరైనా అడిగితే, నీ దేహమెంతో, ఈ దేహం కూడా అంతే, ఈ శవమా నిన్ను అనుగ్రహించేది? దీనిని కాలిస్తే బూడిద అవుతుంది. ఇదా మిమ్మల్ని అనుగ్రహించేది? దేహాలు వేరు కానీ, మనసులు వేరు కానీ, అహంకారాలు వేరు కానీ ఆత్మ ఒక్కటే! మాకు అందరికీ మోక్షం కావాలి, మాకు అందరికీ

మోక్షం కావాలి అని మీరు అందరూ అనుకోవచ్చు. మీ లోపల ఉండి నాకు మోక్షం కావాలి, నాకు మోక్షం కావాలి అని కోరేవాడు ఎవడు? ఎప్పుడైనా ఈ ప్రశ్న మీలో ఉదయించిందా? ఈ ప్రశ్న మీరు ఆలోచించుకున్నారా ప్రశాంతంగా? నిజమైన గురువు మిమ్మల్ని సత్యం వైపుకి తీసుకుని వెళ్ళడానికి ప్రయత్నం చేస్తాడే కానీ మీగొప్పల కోసం, మీ మన్ననలు కోసం చూసేవాడు గురువు కాదు. ఈ దేహం నువ్వు కాదు, ఈ మనస్సు నువ్వు కాదు అని, మిమ్మల్ని ఆత్మ వైపుకి తీసుకు వెళ్ళేవాడు గురువా? లేకపోతే దేహభావనని, మానసికభావనని, అహంకారభావనని పెంచేవాడు గురువా? దేహభావన ఎలాగో నీకు ఉంది కదా, దీనిని ఇంకా అభివృద్ధి చేసేవాడు గురువా? దేహభావన నుంచి విడదీసి ఆత్మ వైపు ప్రయాణం చేయించే వాడు గురువా? Teaching అనేది cheating కోసం కాదు. అంటే బోధ అనేది మోసం కోసం కాదు. మోసం చెయ్యడానికి బోధ ఎందుకు? జ్ఞానికి గొప్ప ఎందుకు తనకంటే వేరుగా ఒకడు ఉంటే కదా, తనకంటే వేరుగా ఆయనకు వస్తువే కనపడదు. ఇంక గొప్ప తోటి పనేముంది అసలు? గొప్పలు దాటకుండా వాడు జ్ఞానే అవ్వలేడు. జ్ఞానికి గొప్ప తోటి పనిలేదు. ఆత్మని తెలుసుకునే వరకు ప్రతీ వాడు జీవే. మనం కళ్ళతోటిచూసేవి అన్నీ కూడా మనం చేసినవే. ఏనాడో చేసినవి ఇప్పుడు మనకి కనిపిస్తున్నాయి. అప్పుడు కర్తృత్వం తోటి చేస్తాం, దాన్ని బట్టి వాసన పుడుతుంది. ఆ వాసనలే లోకంలో కనిపిస్తాయి. చేసినవే కనిపిస్తాయి, చెయ్యకపోతే ఏమీ కనపడదు. ఇప్పుడు మనం చూసేవి అన్నీ చేసినవే.

ఎవడైనా బాగా చదువుకున్నవాడు మనకు కనిపించాడు అనుకోండి, వాడు చాలా గొప్పగా కనిపిస్తాడు మన కళ్ళకి, ఎందుచేత? మన వాసన కారణం. పెద్ద ధనవంతుడు కనిపించాడు అనుకోండి వాడు మనకి బాగా గొప్పగా కనిపిస్తాడు. కారణం వాడు గొప్పవాడు కాదు మన వాసన బట్టి వాడు గొప్పవాడి కింద కనిపిస్తాడు. వాడు ఆత్మే. మీకు విద్యకి సంబంధించిన వాసన ఉంటే బాగా చదువుకున్నవాడు చాలా గొప్పవాడి కింద కనిపిస్తాడు. మీకు కీర్తికి సంబంధించిన వాసన ఉంది అనుకోండి బాగా కీర్తి ఉన్నవాడు గొప్పవాడి కింద కనిపిస్తాడు వాడికి చదువు లేకపోయినా సరే, ధనం లేకపోయినా సరే. వాసన కల్పిస్తుంది ఈ లోకం, అందుకే మనం ఈ లోకంలోకి వచ్చాం. వాసనాక్షయంఅయినవాడికి దేవుడి తోటి పని లేదు. లోకం తోటి పనిలేదు. మాయ తోటి పని లేదు, లోపల వాసనని వదిలేసి బయట ఏది కనపడదు. అది మీరు పరిశీలన చేసి చూసుకోండి.

భగవాన్ ఎక్కడికీ వెళ్ళేవారు కాదు కానీ, రామకృష్ణులు ఎవరైనా శిష్యులుపిలిస్తే వారి ఇంటికి వెళ్ళేవారు. అలాగే ఒకరు ఇంటికి వెళ్ళారు, అది చాలా పెద్ద భవనం. మంచి మంచి రంగులు వేశారు. రామకృష్ణుడి శిష్యుడు ఒకడు ఏమన్నాడు అంటే.... ఎంత గొప్ప

మేడ ఇది, ఎన్ని గొప్ప రంగులు వేశారు అన్నాడు. ఎంత గొప్ప మేడ అయినా ఇటుకలు తోటి, సిమెంటు తోటి కట్టేదే కదా అంటాడు రామకృష్ణుడు. అంటే రామకృష్ణుడు ఎక్కడికక్కడ ఎలా కోసేస్తున్నాడో చూడండి, మనకి ఆ మేడలో, ఇటుకలు ఉన్నాయా, సిమెంటు, సున్నం ఉన్నాయా మనకు అక్కర్లేదు. చూసిన వెంటనే మనకు రూప దృష్టి వచ్చేస్తుంది. రూపం యొక్క సహజ లక్షణం ఏమిటి అంటే మనసుని ఆకర్షిస్తుంది రూపం. రూపం లేకుండా అహంకారం నిలబడదు, అహంకారం ఉండలేదు. అందుచేత ఒక రూపాన్ని పట్టుకుంటుంది. ఆ రూపాన్ని విడిచి పెట్టాక ఇంకొక రూపాన్ని పట్టుకుంటుంది. రూపాన్ని విడిచి పెట్టి ప్రత్యేకంగా అహంకారానికి అస్థిత్వం లేనే లేదు. ఈ దేహం నాది, ఈ దేహం నాది అని అనుకుంటున్నాను అనుకోండి, ఈ దేహం పోయింది అనుకోండి, తరువాత ఇంకొక దేహం వస్తుంది. అప్పుడు ఆ దేహం నాది, ఆ పేరు నాది అనుకొంటాను. ముందు ఉన్న దేహం గొడవ కాని, ఆ పేరు గొడవ కాని నాకు అసలు ఉండదు. ఎందుచేత? ఆ దేహాన్ని వదిలేశాను నేను, ఆ పేరుని వదిలేశాను. కొత్త దేహం తోటి కలిశాను, కొత్త పేరు తోటి కలిశాను కాబట్టి ఆ దేహం ఏమైపోయినా, ఆ పేరు ఏమైపోయినా నాకు అక్కర్లేదు.


మనం ఎక్కడైనా అద్దె ఇంట్లో ఉంటున్నాం అనుకోండి, కొత్త ఇల్లు చూసుకున్నాకేఈ ఇల్లు ఖాళీ చేస్తాం. కొత్త ఇల్లు చూసుకోకుండా, ఈ ఇల్లు ఖాళీ చెయ్యము. ఉండవయ్యా నాకు కొత్త ఇల్లు ఎక్కడా దొరకలేదు అంటాం. మన అహంకారం కూడా కొత్త దేహాలు ఎక్కడో చూసుకుని ఇది ఖాళీ చేస్తుంది. దేహం లేకపోతే అది ఉండలేదు, రూపం లేకపోతే అది ఉండలేదు, నామం లేకపోతే ఉండలేదు. నామరూపాలు దానికి ఆహారం, ఈ జన్మలో ఏదో ఒక రూపాన్ని పట్టుకుని వేలాడుతూ ఉంటుంది, ఏదో ఒక నామాన్ని పట్టుకుని వేలాడుతూ ఉంటుంది. ఆ రెండింటిని తీసేసి ప్రత్యేకంగా నువ్వు నిలబడు అంటే నిలబడటానికి అవకాశం లేదు. పోనీ దానికి రూపం ఉందా అంటే దానికి రూపం లేదు. అది మనకి కనపడదు. అహంకారానికి రూపం లేదు, కానీ బయట కనిపిస్తున్న రూపాలు దానికి కావాలి.

రామకృష్ణుడి తోటి వివేకానందుడు "నేను మీ దగ్గరకి చూడటానికి వస్తున్నాను. మేము కాలేజిలో చదువుకునే పిల్లలం. మేము మీ దగ్గరకి చూడటానికి వస్తున్నాం అని కలకత్తా సిటీలో ఉన్న కొంతమంది లౌకికులుమమ్మల్ని విమర్శిస్తున్నారు" అని చెప్పాడు. "నిన్ను చూసి నవ్వే వాళ్ళు, నిన్ను చూసి వేళాకోళంచేసే వాళ్ళని చూసి నువ్వు ఏమనుకుంటున్నావు" అంటాడు రామకృష్ణుడు. "ఏనుగును చూసి కుక్కలు మొరుగుతున్నాయి అనుకుంటున్నాను" అంటాడు నరేంద్రుడు. అప్పుడు రామకృష్ణుడు "అంతదూరం వెళ్ళిపోకు, వాళ్ళని కుక్కలు

అనుకోకు. ఎందుకంటే అహంకారం పుడుతుంది" అంటాడు. వాళ్ళు అందరినీ కుక్కలు అనుకుంటే ఎవరికి అహంకారం పుడుతుంది? వివేకానందకి అహంకారం పుడుతుంది. అందుచేత అంతదూరంవెళ్ళకు, వాళ్ళని కుక్కలు అనిఅనుకోకు. విజృంభిస్తున్న మనసుని ఆపటం కోసం బ్రేక్ వేశాడు రామకృష్ణుడు. నిజమైన గురువు చేసే పని అది. వాళ్ళు అనుకుంటే అనుకున్నారు. అంత నీచభావం తోటి వాళ్ళని చూడకు. కృతజ్ఞత ఎలా ఉంటుందో తెలియని మనిషి యొక్క మాంసం కుక్కలు కూడా తినవని వాల్మీకి రామాయణంలో చెప్పాడు. నేను చెప్పింది కాదు. ఆనాడు శ్రీకృష్ణుడు గోపికలని ఉద్ధరించేందుకు గొల్లవాడై పుట్టి ఆవుల్ని కాచినట్టే, ఈనాడు సర్వేశ్వరుడే తిరిగి అవతారం ఎత్తి మాబోటి సాధకులని ఉద్ధరించడానికే వంటలు వాడై మాకు బోధించి, జ్ఞానం ఇచ్చి, తన చేతుల తోనే వండి భక్తులకి వడ్డించి అనుగ్రహించాడు. వంట చెయ్యటం అంటే నామోషి అనుకుంటారు చాలామంది. వంట కూడా పెద్ద కళ అది, భిక్ష కోసం రాశారు భగవాన్ అక్షరమణమాల, అది భోజనం కోసం రాసింది.

**దోషరహిత నీవు నాతో నైక్యమయి నిత్యానందమయ మొనర్పరుణాచలా**

దోషరహిత నీవు నీకు దోషాలు లేవు. నువ్వు స్ఫటిక లాంటి వాడవు. మరి దోషాలు లేని స్థితికి ఏనాటికి మనం రావటం? దోషాలు లేని స్థితికి మన మనసు ఎప్పటికి ఎదుగుతుంది? మనం చేసే స్నేహాలు జాగ్రత్తగా ఉండాలి, మనం తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి, మనం చేసే పనులు జాగ్రత్తగా ఉండాలి, అప్పుడు దోషాలు లేని స్థితికి మనం ఎదగగలం. ఎదగటం అంటే శరీరం ఎదగటం కాదు. మనస్సు ఎదగాలి, మానసిక వికాసం పొందాలి. ఎలా వస్తుంది మానసిక వికాసం? మాములుగా వస్తుందా అంటే రాదు. మనం చేసే పనులు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం చేసే స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇన్ని జాగ్రత్తలు పడితే అప్పుడు మన దోషాలు మన హృదయం నుండి రాలిపోతాయి, కాలిపోతాయి.



**ఈశ్వరుడు మిమ్మల్ని స్మరించకపోతే మీరు ఈశ్వరుడిని స్మరించలేరు. సత్యాన్ని తెలుసుకోవాలనే కాంక్ష మీకు బలీయంగా కలుగుతుంటే ఈశ్వరానుగ్రహం మీపై ఉన్నట్లే.**

అరుణాచలేశ్వరుడా నువ్వు దోష రహితుడవు. లోప రహితుడవు, పాప రహితుడవు. మనకి గురువు రమణభగవాన్ అయితే రమణభగవాన్‌కి గురువు ఉన్నారు, ఆయన ఎవరు? అరుణాచలేశ్వరుడు. గౌతమబుద్ధుడు కూడా ఎక్కడా గురువు దగ్గర ట్రైనింగ్ అవ్వలేదు. అలాగ రమణభగవాన్ కూడా గురువు దగ్గర ట్రైనింగ్ అవ్వలేదు. గౌతమబుద్ధుడికి గురువు లేడు. అయితే రమణభగవాన్‌కి గురువు ఉన్నాడు. మాములుగా బాహ్యంగా లేకపోయినా, అరుణాచలేశ్వరుడినే ఆయన గురువు కింద భావన చేశాడు. దోష రహిత నీవు. ఎక్కడ లోపాలు లేవో, ఎక్కడ పాపాలు లేవో, ఎక్కడ దోషాలు లేవో, ఎక్కడ బలహీనతలు లేవో అక్కడ ఉన్నాడు అరుణాచలేశ్వరుడు. అక్కడకి తీసుకుపోవయ్యా అరుణాచల. ఒక జ్ఞాని పక్కన మనం కూర్చోవచ్చు. భౌతికంగా వాడు మనకి ఎంతో దగ్గరగా ఉంటాడు. కానీ లోపల చూస్తే వాడు ఎక్కడ ఉన్నాడు? మనం ఎక్కడ ఉన్నాం? గణపతిముని గారు భగవాన్ దగ్గరకివచ్చేవరకు దూడలు కాచుకునే కుర్రవాళ్ళు అందరూ కూడా భగవాన్ కూడా మనలో ఒకరనే అనుకున్నారు. పైగా వాళ్ళు గోళీ కాయలు తెస్తే ఈయన కూడా గోళీ కాయలు ఆడేవారు వాళ్ళతోటి!

నేను సాధన చేస్తున్నాను, నేను నాలుగు గంటలు సాధన చేస్తున్నాను, ఆరు గంటలు సాధన చేస్తున్నాను ఇలా అనుకుంటూ ఉంటాం, మనం లెక్కలు కట్టుకుంటాం. కానీ సాధన చేసేవాడు ఎవడు? కనీసం ఆ ప్రశ్న ఎప్పుడైనా ఇక్కడ వచ్చిందా? మనం ధ్యానం చేస్తున్నాం, ధ్యానం చెయ్యమని భగవాన్ కూడా చెప్పారు. భగవద్గీతలో భగవంతుడు కూడా చెప్పాడు. కానీ లోపల మీలో ఉండి ధ్యానం చేసేవాడు ఎవడు? ఎప్పుడైనా మీకు ఈ అనుమానం కలిగిందా ఎవరికి అయినా? సోదరమహాశయులారా, మీరు ఎన్ని గంటలు ధ్యానం చేశారు, ఎన్ని రోజులు ధ్యానం చేశారు అన్నది సమస్య కాదు. ఆ ధ్యానం చేసేవాడు ఎవడో మీకు తెలియకపోతే ఆనాటి వరకు జ్ఞానం కలగనే కలగదు. గమ్యం శాశ్వతం. ఆచారాలు ఊరికే టైముని బట్టి, కాలాన్ని బట్టి వస్తాయి. ఆచారాలు నిలబడేవి కావు. గమ్యం అనేది శాశ్వతం. కాలమాన పరిస్థితిని బట్టి ఆచారాలు మారతాయి. ఆచారాలు శాశ్వతం కాదు.

సాధన పేరు మీద మీరు ఎందుకు అంత కష్టపడతారు? ఎందుకు దుఃఖ పడతారు? మీరు హృదయ పూర్వకంగా చెప్పండి, మీ హృదయంలో ప్రీతి ఉందా ఈశ్వరుడి మీద? జపాలు అంటున్నారు, పూజలు అంటున్నారు, ధ్యానాలు అంటున్నారు, యాత్రలు అంటున్నారు. కష్టపడుతున్నారు రైటే. కానీ హృదయంలో ఎప్పుడైనా మీకు ఈశ్వరుడి పట్ల ప్రీతి పుట్టిందా? ఈశ్వరుడి పట్ల ప్రీతి లేకుండా ఈశ్వరుడు దర్శనం ఇస్తాడా? ఒక్క ప్రీతి చాలు ఈశ్వరుడి మీద, ఎక్కడైనా మన హృదయంలో ఆ ప్రీతి ఉందా? ఆ ప్రీతి లేకుండా ఎన్ని ధ్యానాలు చేస్తాం,

ఎన్ని పూజలు చేస్తాం, ఎన్ని జపాలు చేస్తాం, ఎన్ని యాత్రలు తిరుగుతాం. హృదయంలో ప్రీతి లేకుండా ఇలా సాధనలు చేయటం వలన ఏమీ ప్రయోజనం లేదు. కనీసం నీ బిడ్డలని ఎలా ప్రేమిస్తున్నావో, అంతవరకు అయినా ఎప్పుడైనా ఈశ్వరుడిని ప్రేమించావా అంటాడురామకృష్ణుడు. మీ బిడ్డల క్షేమం పట్ల మీకు ఎంత దృష్టి వెళ్తుందో, మీ బిడ్డల పట్ల మీకు ఎంత కుతూహలంగా ఉందో, కనీసం ఆ మాత్రం కుతూహలం అయినా, ఆ మాత్రం ప్రేమ అయినా, ఆ మాత్రం ఆసక్తి అయినా ఎప్పుడైనా ఈశ్వరుడి పట్ల మీ మనస్సుకి కలిగిందా? మీ బిడ్డలని ఏ విధంగా స్మరిస్తున్నావో, కనీసం ఆ మాత్రమైనా ఎప్పుడైనా ఈశ్వరుడిని స్మరించావా?

భగవాన్ కూడా పళిని స్వామి ఉన్నట్టు, రామకృష్ణుడు మేనల్లుడు రామకృష్ణుడు కూడా తిరిగేవాడు. ఇద్దరూ గంగానదిలో స్నానం చేసి వచ్చేస్తున్నారు, ఒకసారి గవర్నర్ గారి మేడ అలా చూశాడు వారి మేనల్లుడు. రోజు వస్తారు ఆ దారిలో, మావయ్య, మావయ్య అని వెర్రి కేకలు వేశాడు. మావయ్యా, మావయ్యా అని పిలుస్తున్నాడుఅని వెనక్కి తిరిగి చూశాడు. మావయ్యా చూడు చూడు, నువ్వుచూడకుండా వెళ్ళిపోతున్నావు. ఎంత పెద్ద మేడ చూడు, గవర్నర్ గారి మేడ అంటున్నాడు. ఏమి చూస్తావురా ఇటుక మీద ఇటుక. పెద్ద మేడే ఇటుక మీద ఇటుక. నాలుగు వరుసలు పేర్చితే ఇంకొక అంతస్తు వస్తుంది. ఏమి చూస్తావురా ఇటుక మీద ఇటుక అంటాడు రామకృష్ణుడు. అతనికి బాహ్యదృష్టి పోవటం లేదు. బాహ్య దృష్టి పోవటం చాలా కష్టం.


రామకృష్ణుడు కేన్సర్ తోటి పీడింపబడిన రోజులలో ఆ చివరి రోజులలో నరేంద్రుడికి డౌట్ వచ్చింది. ద్వైతదృష్టి ఎంతకాలం అయితే మనిషికి ఉందో ఆ మనిషి ఎంత గొప్పవాడు అయినా వాడికి తప్పనిసరిగా సందేహం వస్తూ ఉంటుంది. ద్వైత దృష్టిని దాటితేనే కానీ సందేహాలు ఆగవు. రామకృష్ణుడు అద్వైత స్థితిలో ఉండగా కూడా కేన్సర్ వ్యాధితో పీడించ బడుతున్నప్పుడు, తన గురువు మీద తనకే అనుమానం వస్తుంది నరేంద్రుడికి, నువ్వు దేవుడి తోటి సమానమైన వాడివే కదా అనిఏదో కొత్త కొత్త సందేహాలు అతనికి వస్తున్నాయి. నువ్వు నిజంగా ఈశ్వరుడివేనా? నువ్వు నిజంగా జ్ఞానివేనా? నువ్వు ప్రకృతిని దాటినవాడవేనా? అని సందేహాలు వస్తాయి. ప్రకృతిని దాటకుండా ఎవడూ జ్ఞాని కాలేడు. ప్రకృతిని దాటని వాడికి ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇవ్వడు. అతనిని సందేహం పీడించేస్తోంది లోపల, పైకి అడగటానికి సిగ్గు పడుతున్నాడు. అప్పుడు అంటాడు రామకృష్ణుడు ఓ నరేన్! ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు అంటాడు. ఆ రాముడు ఎవడో, ఆ కృష్ణుడు ఎవడో వాడే ఈ రామకృష్ణుడు. మన భారాలను ఈశ్వరుడు వదల్చాలి కాని మన

శక్తి సరిపోతుందా మన భారాలన్నీ వదిలించుకోవడానికి. మనం భగవంతుడికి నిజంగా అర్పణ చేస్తే మనకి దుఃఖం ఎందుకు వస్తుంది? మీలో ఎవరికి అయినా నిజంగా దుఃఖం వస్తుంటే, భగవంతుడికి నిజంగా మనల్ని మనం అర్పించుకుంటే ఇక్కడ దుఃఖ పడేవాడు ఎవడు ఉన్నాడు? అంటే ఇక్కడ దుఃఖ పడేవాడు ఎవడైనా ఉంటే మనం వాడిని అర్పించటం లేదు అన్నమాట. ఇంక అది అర్పణ ఎలా అవుతుంది? భగవంతుడికి కనుక నన్ను నేను అర్పించుకుంటే ఇక్కడ దుఃఖ పడటానికి ఎవడు ఉన్నాడు? మీకు కొండ గుర్తుకి చెబుతున్నాను. మీకు ఎంత పెద్ద కష్టం వచ్చినా చిన్న కష్టంగా కనిపిస్తుంటే, ఎంత భారం పడినా చిన్న భారం కింద కనిపిస్తుంటే, పెద్ద బరువు కూడా చిన్న బరువుగా కనిపిస్తుంటే, పెద్ద నష్టం కూడా చిన్న నష్టం కింద కనిపిస్తుంటే, అప్పుడు మీకు జ్ఞానం కలుగుతుంది. ఒక్క జ్ఞానానికే ఆ శక్తి ఉంది. పెద్ద పెద్ద సమస్యలు కూడా చిన్న సమస్యలుగా కనిపిస్తుంటే, పెద్ద పెద్ద కష్టాలు కూడా చిన్న కష్టాలుగా కనిపిస్తుంటే, వాడు జ్ఞానంలో కూరుకు పోతున్నట్టు. వాడు జ్ఞానం వైపు ప్రయాణం చేస్తున్నట్టు. కొన్ని వస్తువులు నీటిలో ఎలా తేలిపోతాయో, జ్ఞానికి ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ తేలిపోతాయి. జ్ఞానిని ముంచే శక్తి అక్కడ ఉండదు. భక్తులు కాని వారు ఎవరు అండి? అందరూ భక్తులే కానీ ఒక్క జ్ఞానికే నా స్వరూపం ఇస్తాను అన్నాడు పరమేశ్వరుడు. ఆయన స్వరూపం ఏమిటి? ఆత్మ.

మోక్షం సంపాదించడం కోసం వ్రతాలు చేస్తున్నాము అని కొంతమంది అంటారు రైటే. మరి ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? మోక్షాన్ని సంపాదించటం కోసం మీరు వ్రతాలు చేస్తున్నారు. చాలా కష్టపడుతున్నారు. జపాలు చేస్తున్నారు. ధ్యానాలు చేస్తున్నారు. రైటే కానీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? మీరు ఖర్చు పెట్టిన నాలుగు గడియలకి, నాలుగు రూపాయలకి మోక్షం వచ్చేస్తుంది అన్నమాట. రామకృష్ణుడు అంటాడు ఒకచోట, నీకు దేవుడు కనిపిస్తే, నాకు చెరువు తవ్వించాలి, నాకు కాలవ తవ్వించాలిఅనిఅడుగుతావా? నాకు జ్ఞానాన్ని ఇమ్మని అడుగుతావా? పూజలు ఫలితంగా, నోములు ఫలితంగా, దేవుడు కనిపిస్తాడు అనుకోండి ఇవాలే కనిపిస్తాడు అనుకోండి, మీరు ఏమి అడుగుతారు? ఈ ఒక్క ప్రశ్న మీరు సదా జ్ఞాపకం ఉంచుకోండి. ఏ పని చేసినా, మీరు మోక్షం కోసమే చేస్తున్నారు. ఒక మంచి మాట చెప్పినా, ఒక మంచి మాట విన్నా, పరులకి హితం చేసినా, సోషల్ సర్వీస్ చేసినా, ఏది చేసినా మోక్షం కోసమే మీరు చేస్తున్నారు. నేను కాదు అనటం లేదు. కానీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?

శృంగేరి పీఠంలో ఒకతను పొరపాటున ఏమి చేశాడు అంటే వంటలో ఉప్పు ఎక్కువ

వేసేశాడు. ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు మామూలుగా అతనికి అలవాటు కొలది ఉప్పు ఎక్కువ పడిపోయింది. మాములు లౌకికులు అయితే ఒకరోజు సహించరు. భక్తులు కాబట్టి నాలుగు రోజులు సహించారు. తరువాత శృంగేరి స్వామి వారి దగ్గరకి వెళ్ళి ఏవండీ కూరలలో ఉప్పు ఎక్కువ అవుతోంది ప్రతీరోజు అని చెప్పారు, శృంగేరి స్వామి వారు తెలివి గలవారు, ఆయన ఏమి చెప్పారు అంటే, వాడూ రోజూ తింటున్నాడు. నేను కేకేసి నువ్వు ఉప్పు ఎక్కువ వేస్తున్నావు కూరలలో అని అతనితో చెబితే నాలుగు రోజులు జాగ్రత్త పడతాడు. ఐదో రోజున మళ్ళీ మాములుగా ఉప్పు ఎక్కువ వేస్తాడు. మీకు వండి పెట్టిందే వాడు కూడా తింటున్నాడు. వాడు ప్రత్యేకంగా కూర వండుకోవటం లేదు. అయితే ఉప్పు ఎక్కువ వేశాను అన్న సంగతి వాడు తినేటప్పుడు వాడికి తెలియటం లేదు. నాలుగు రోజులు నుంచి ఉప్పు ఎక్కువ అవుతోంది. ఇంకొక రెండు రోజులు ఆగండి వాడికే తెలుస్తుంది. ఇంక మళ్ళీ ఎప్పుడూ ఉప్పు ఎక్కువ వెయ్యడు. వాడికి తెలిస్తే వాడికి కోపం రాదు, అయ్యో మనం ఐదు రోజుల నుంచి ఇంతమందిని బాధ పెట్టాం అని పశ్చాత్తాపం తోటి ఈ తప్పు ఎప్పుడూ చెయ్యడు. అలా కాకుండా ఫలానా వాళ్ళు చెప్పారు అని మీ అందరి ముందు నేను కబురు పంపించి వాడిని తిడితే వాడు సవరణ చేసుకోడు సరికదా, కోపం వస్తుంది వాడికి. మీరు అందరూ నా మీద నేరాలు చెబుతారా? పైగా తినేసి ఇటువంటి గొడవలలోకి దూరుతున్నారు అనుకుంటాడు. అంటే ఏ మనిషికి ఆ మనిషి అయ్యో నాలుగు రోజుల నుంచి మనం ఇంతమంది భక్తులని బాధ పెడుతున్నాం అని తన హృదయంలో తనకి పశ్చాత్తాపం కలిగితే మళ్ళీ ఈ పొరపాటు వాడు జీవితంలో చెయ్యడు. అందుచేత ఇంకొక్క రెండు రోజులు ఓపిక పట్టండి. మళ్ళీ ఎన్నడూ అతను జీవితంలో ఉప్పు ఎక్కువ వెయ్యడు. అలా కాదు అని మీరు కంగారు పడతారా, నేను పిలిచి చెబుతాను. వాడు తన పొరపాటు సవరించుకోడు సరికదా, మీ అందరి మీద వాడికి కోపం వస్తుంది. ప్రతీ మనిషికి కూడా తన అనుభవం తనకి రావాలి. ఎదుటివాడు అనుభవాన్ని తన స్వంతం చేసుకోవడానికి మహా మేధావి అయి ఉండాలి వాడు.



**అవసరాలు వేరు, కోరికలు వేరు. తమ అవసరాలకు సరిపడ సంపాదించుకొంటూ మిగిలిన కాలాన్ని ఆత్మకోసం ఖర్చుపెట్టేవాడికే ఆత్మ తెలియబడుతుంది.**



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

భగవద్గీత మోక్ష గ్రంధం. ఎదుటి వాళ్ళు మనల్ని ద్వేషిస్తే, ఎదుటి వాళ్ళు మనలని భయపెడితే, ఎదుటి వాళ్ళు మనలని పీడిస్తూ ఉంటే, అప్పుడు మనం ఏమి చేయాలి అనే దానికి ఇక్కడ కృష్ణుడు చెబుతూ,

**జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః ।**
**శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానావ మానయోః ॥ 06-07 ॥**

**తాత్పర్యము:** శీతోష్ణములు, సుఖదుఃఖములు, మానావమానములు, మున్నగు ద్వందముల యందు అంతఃకరణ వృత్తులు నిశ్చలముగా (చలింపక) ఉండి, స్వాధీనమైన ఆత్మగల పురుషుని జ్ఞానమునందు సచ్చిదానంద ఘన పరమాత్మ చక్కగా స్థితుడై ఉండును. అనగా పరమాత్మ తప్ప అతని జ్ఞానమునందు అన్యమేదియును ఉండదు.

జితాత్మనః నీ మనసుని జయించాలి. ఇంద్రియాలని జయించాలి. అర్పణ అంటే మనం దేవుడికి ఇచ్చే పళ్ళు అనుకుంటాం. కాని సరెండర్ అంటే అది కాదు. సరెండర్ అంటే మన అహంకారం ఇవ్వాలి. అసలు మన జీవితమే బిజినెస్ కింద మారిపోయింది. నువ్వు నాకు పండు ఇయ్యి, నాకు పుష్పం ఇయ్యి, నాకు తోయం ఇయ్యి, నీళ్ళు ఇయ్యి అని దేవుడే మనలని అడుగుతున్నాడు ఇవన్నీ మనం దేవుడికి ఇవ్వటం అలవాటు చేసుకుంటే, చివరిసారిగా, నెమ్మదిగా మన అహంకారాన్నిసరెండర్ చేయటం కోసం దేవుడే మనలని

ఇవన్నీ అడుగుతున్నాడు. మనం ఎంతవరకు స్వార్థాన్ని పెంచుకుంటూ వెళితే, అంతవరకు మన హృదయంలో పతనం అవుతూ ఉంటాం. దేవుడు చెప్పేది ఏమిటంటే, ఎవడైతే మనసుని జయిస్తున్నాడో, తన యొక్క అహంకారాన్ని ఎవడైతే జయించాడో, ఎవడైతే దేవుడి పాదాల ముందు ఈ నేను ని పెట్టగలుగుతున్నాడో, వాడికే దేవుడు అంటే ఏమిటో తెలుస్తుంది.

తధామానావ మానయోః దేవుడు జీవుడికి ఏమని చెబుతున్నాడు అంటే నువ్వు ఎదుటి వాడిని ద్వేషించవద్దు. ఎదుటి వాళ్ళు ఏమైనా చిన్న మాట అంటే మన మనసు తలకిందులు అయిపోతుంది. ఈ యాక్షన్ బట్టి, ఈ రియాక్షన్ బట్టి మనకి క్యారెక్టర్ తయారు అవుతుంది. బాగా ఆలోచించవలసిన విషయం ఏమిటంటే, ఎదుటి వాళ్ళు మనలని ద్వేషించినపుడు, ఎదుటి వాళ్ళు మనలని అవమానించినపుడు, ఎదుటి వాళ్ళు మనల్ని తిరస్కారం చేసినప్పుడు, అప్పుడు కూడా నువ్వు తలకిందులు అయిపోకుండా, ఆత్మానుభవం విడిచి పెట్టకూడదు. నిన్ను గౌరవించినా, నిన్ను గౌరవించక పోయినప్పటికీ, నీ మైండులో ఉన్న సమానత్వం పోకూడదు. అది పోయిందా నువ్వు భక్తుడవు కాదు.

మీరు ఏ బట్ట కట్టుకుంటున్నారు, మీరు స్త్రీలా పురుషులా, మీరు ఏ దేశం వాళ్ళు, అది కాదు ఇక్కడ సమస్య, మీ మనసు ఎలా ఉంది? మీ మనసుని మీరు ఎంతవరకు బాగు చేసుకున్నారు అది చూసుకోండి. మనిషి అంటే కేవలం బాడీయే కాదు శరీరము, మనస్సు, బుద్ధి,ఇవన్నీ కలిపితేనే మనిషి అవుతాడు. రోజూ మన శరీరానికి దుమ్ము పోవటం కోసంస్నానం చేస్తున్నాం. అయితే మనసుకి కూడా స్నానం చేయాలి. భగవద్గీతని చదవటం వల్ల, మీరు చదివించటం వల్ల, మన మనసులో ఏమైనా మలినాలు ఉంటే అవి నెమ్మదిగా బయటకు కొట్టుకు పోతాయి. ఎదుటి వాళ్ళు నిన్ను గౌరవం చేసినప్పుడు, లేకపోతే అవమానం చేసినప్పుడు, ద్వేషించినప్పుడు కూడా నీ మైండ్ బాలన్స్ తప్పకుండా ఉండాలి. అన్ని పరిస్థితులలో కూడా నువ్వు ఆత్మానుభవంలో ఉండాలి సహజ స్థితిలో, ఆత్మ స్థితిలో ఉండాలి. కాని ఎవరైనా నిన్ను అగౌరవ పరిస్తే నీ మనసు తలకిందులు అయిపోతే నీకు దుఃఖం వస్తే, లోపల నీకు తెలియకుండా గౌరవం మీద కోరిక ఎక్కువ ఉన్నట్టు. కోరికలు ఎవరిలో అయితే ఎక్కువగా ఉన్నాయో ఆ మనిషి ఎక్కువగా అశాంతితో ఉంటాడు. లోకాన్ని

చూసి లోకం యొక్క విమర్శలు చూసి, నీ సమస్థితిని పోగొట్టుకోవద్దు.

ప్రశాంతస్య:నువ్వు ప్రశాంతంగా ఉండు, ప్రశాంత స్థితికి మాత్రం భంగం తెచ్చుకోకు. పరమాత్మా సమాహిత: పరమాత్మ అందరిలోనూ ఉన్నాడు. సమానంగా ఉన్నాడు. అందరిలోనూ సమానంగా ఉన్న ఆత్మానుభవం నుండి కదలకు. నీకు గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా, ఎదుటి వాడు నిన్ను ద్వేషించినా, ఎదుటివాడు నిన్ను ప్రేమించినా, ప్రేమించక పోయినప్పటికీ సమానంగానే ఉండు. మన మనసులో హెచ్చు తగ్గులు ఎక్కువ ఉంటాయి. ఈ హెచ్చు తగ్గులు తొలగించుకుని, మనసులో ఎవడైతే సమదృష్టి కలిగి ఉన్నాడో వాడే యోగి.

సర్వ సాధారణంగా వాతావరణ మార్పులు కూడా మన మనస్సు మీద పని చేస్తాయి. బాగా చలి ఉన్నప్పుడు ఒకరకంగా ఉంటాం, సమ్మర్ లో ఒకరకంగా ఉంటాం, ఈ వాతావరణ మార్పులు కూడా మీ యొక్క మనసు మీద పనిచేసినప్పటికీ, మీ ఆత్మానుభవంలో మటుకు తేడా రాదు. ఇది ప్రాక్టికల్ సైన్స్. కృష్ణుడు చెప్పేది కూడా సైన్సే. మిమ్మల్ని మీరు పరీక్ష చేసుకోండి. మీకు సుఖం వచ్చినప్పుడు లేకపోతే దుఃఖం వచ్చినప్పుడు మీ మనసు ఎలా ఉంది? సమానంగా ఉందా లేదా? సుఖం వచ్చినప్పుడు పొంగిపోతోందా? దుఃఖం వచ్చినప్పుడు క్రుంగిపోతుందా? అలా జరుగుతుంటే మీకు ఆత్మానుభవం లేనట్టే. కృష్ణుడు చెప్పేది ఏమిటంటే, ఎంత జ్ఞానం ఉన్నప్పటికీ కేవలం జ్ఞానం సరిపోదు. అది ఆచరణలోకి రావాలి. దైనందిన జీవితంలో అది నువ్వు అర్థం చేసుకుని ఆచరిస్తేనే లోపల నీకు ఉన్నటువంటి అమృత స్థితి, ఆత్మ స్థితి నీకు అందుతుంది అన్నాడు. ఇది కృష్ణుడు చెప్పినటువంటి టెక్నిక్, జీవితం పొడవునా, అనుదినం పారాయణ చేయవలసినటువంటి గ్రంథం ఈ భగవద్గీత.

ఈ శ్లోకం యొక్క అర్థం ఏమిటి అంటే సముద్రంలో అనేక నీళ్ళు వచ్చి పడుతూ ఉంటాయి. అనేక నదులు వెళ్లి సముద్రంలో కలుస్తూ ఉంటాయి. ఆ సముద్రం మటుకు ఏమి వికారం చెందకుండా నిర్వికారంగా ఉంటుంది. అనేక నదులు వెళ్లి సముద్రంలో కలిసినప్పటికీ అది గట్టు దాటి రాదు,అలా ప్రశాంతంగా ఉంటుంది, దాని ధర్మాన్ని అది తప్పటం లేదు. దానికేమి పొంగు రావటం లేదు, నిర్వికారంగా ఉంటుంది. అదేవిధంగా జ్ఞాని దేహ

ప్రారబ్ధాన్ని బట్టి వాడు ఏ స్థితిలో ఉన్నప్పటికీ, ఎన్ని భోగాలు ఐశ్వర్యాలు వచ్చి మీద పడుతునప్పటికీ, వాడు వికారం పొందడు. వాడే జ్ఞాని.


దేహ ప్రారబ్ధాన్ని బట్టి జ్ఞానికి కూడా మంచి రావచ్చు, చెడ్డ రావచ్చు ఈ మంచి, చెడ్డ అనేవి దేహానికే పరిమితం. మనసుకే పరిమితం. మానసిక పరిధి, దేహ పరిధి దాటినప్పుడు, మంచి చెడు ఆత్మలో లేవు. సముద్రం ఎంత గంభీరంగా ఉందో ఆత్మని తెలుసుకున్న వాడు కూడా అంత గంభీరంగా ఉంటాడు. మనకి ఏదైనా ఒక ఎకరం ఉన్నవాళ్లు రెండు ఎకరాలు కొనుక్కుంటే ఎంతో గర్వం వచ్చేస్తుంది, సంతోషం వస్తుంది, అది అజ్ఞాని లక్షణం. దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఎమైనా అధికారాలు వచ్చినప్పటికీ, లేకపోతే పెద్ద పెద్ద చదువులు, డిగ్రీలు వచ్చినప్పటికీ, భౌతికమైనటువంటివి ఎన్ని వచ్చినప్పటికీ, నదులు అన్నీ వెళ్లి సముద్రంలో పడినప్పటికీ, సముద్రం ఏ విధంగా అయితే నిర్వికారంగా ఉంటుందో, అదే విధంగా జ్ఞాని కూడా నిర్వికారంగానే ఉంటాడు. ఎంతమంది వాడిని గౌరవించినప్పటికీ, వాడిలో వికారం రాదు, చపలచిత్తం రాదు. అందుచేత ఇక్కడ కృష్ణుడు ఏమి చెబుతున్నాడు అంటే సముద్రం ఏ విధంగా అయితే గంభీరంగా ఉంటుందో అదే విధంగా కష్టం రావచ్చు, సుఖం రావచ్చు. నువ్వు మటుకు గంభీరంగా ఉండాలి. జ్ఞానికి ఏమి కోరిక ఉండదు. అనుకోకుండా కోరికలు నెరవేరిపోతూ ఉంటాయి. అతను మటుకు వికారం పొందడు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహాత్మ్యం అక్షరమణమాల

**పొడిచే మైక పరచి నా బోధ హరియించి**

**నీ బోధ గనుపించితివి అరుణాచలా ।73।**

తాత్పర్యము: ఆపరేషన్ చేసే ముందు బాధ తెలియకుండా మత్తు మందు ఇచ్చినట్లు, నన్ను నీ మైకములో పెట్టి నాకు ఏమీ బాధ తెలియకుండానే నా అజ్ఞానాన్ని తొలిగించి, నీ జ్ఞానాన్ని నాకు ప్రసాదించావు అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా, నాకు ఈ శాస్త్రాల గొడవ లేకుండా, ఏమి లేకుండా, నా మీద నువ్వు పొడి చల్లావు. భగవద్గీత బ్రహ్మ సూత్రాలు అంటే భగవానుకి ఏమి తెలియదు. బడిలో పదవ తరగతి చదువుకుంటున్నాడు. అక్కడ నుంచి పరుగెట్టుకుని వచ్చాడు. ఆపరేషన్ చేసే ముందు డాక్టరు మత్తు పెట్టినట్టు, నా మీద మత్తు పొడి చల్లేశావు. నాకేం బాధ కష్టం లేకుండా, నన్ను ఎక్కడికి తీసుకెళ్తున్నావో కూడా నాకే తెలియనివ్వకుండా, నాకు మత్తు ఎక్కించావు. నన్ను మైకంలో పెట్టేశావు. నేను ఆ మైకంలో, ఆ మత్తులో పడిపోయాను. నాకు మత్తు ఎక్కించే వరకు నువ్వు మాట్లాడకుండా ఉరుకున్నావు. మత్తు ఎక్కేవరకు డాక్టరుగారు కత్తి చూపించరు. అలా నువ్వు వైద్యుడవి అయ్యా! శరీరానికి రోగాలు తగ్గించే మామూలు డాక్టరువు కాదు నువ్వు. ఈ సంసారం చక్రం నుండి ఆపరేషన్ చేసి అజ్ఞానాన్ని బయటకి తీసేసే డాక్టరువి. నన్ను ఈ చక్రంలో నుండి, ఈ ప్రకృతిలో నుండి బయటకి తియ్యటం కోసం, నా మీద మత్తు జల్లిన తరువాత నాకు మైకం వచ్చింది. అపుడు నా భోగాన్ని హరించావు. అంటే నా తెలివి తేటలని తీసేశావు.

స్త్రీలలో కాని పురుషులలో కాని తెలివి తక్కువ వాళ్లం అనుకునే వారు ఎవరైనా

ఉన్నారా? మీకు తెలివితేటలు తక్కువ అంటే ఎవరైనా ఊరుకుంటారా? మొద్దబ్బాయి కూడా నీకు తెలివి తేటలు తక్కువ అని తల్లి అన్నా ఊరుకోడు. యదార్థం చెప్పాలంటే మనం అందరం తెలివి తక్కువ వాళ్ళమే, కాని తెలివైన వాళ్ళలా కనిపిస్తున్నాం, ఇదే మోసం. తెలివి తేటలు లేకపోయినా లేనట్టు ఉంటే ఫరవాలేదు, తెలివైన వాళ్ళలా నటిస్తున్నాం. జీవుడికి, అజ్ఞానానికి తెలివి తేటలు ఏమిటండి? ఈ జీవుడికి తెలివి తేటలు ఉంటే, జ్ఞానం ఎందుకు రావడం లేదు? ఆత్మ ఎందుకు తెలుసుకోవడం లేదు? కాలేజీలలోను, యూనివర్శిటీ లోను చదువుకున్న వారికి అందరికి తెలివి తేటలు ఉన్నాయి కదా, వాళ్ళకి జ్ఞానం ఎందుకు కలగటం లేదు? ఎంత చదువుకున్నా ఈ లోకానికే పరిమితం, పొట్టకే పరిమితం.

అరుణాచలేశ్వరుడా, నా బోధని హరించావు. నా తెలివి తేటలు హరించావు. నాకు తెలివి తేటలు తక్కువ అయినా, నేను తెలివైన వాడిని అనుకుంటున్నాను. నాకు తెలివి తేటలు లేవు అనుకుంటే, తెలివి తేటలు సంపాదించడానికి ప్రయత్నం చేస్తాను, ఉన్నాయి అనుకుంటే, ఎలా ప్రయత్నం చేస్తాను? నాకు డబ్బు లేదు అని తెలిస్తే డబ్బు సంపాదిస్తాను. నాకు డబ్బు లేకపోయినా డబ్బు ఉందని అనుకుంటున్నాను అనుకోండి నన్ను నేను మోసం చేసుకుంటున్నాను అన్నమాట. గీతలో మిధ్యాచారులు అన్నారు ఈ బాపతు జనాన్ని. కొంతమంది ఇంటిదగ్గర ఏమీ లేకపోయినా ఉన్నట్టు నటిస్తారు. మేము గొప్పవాళ్ళం కాకపోయినా ఎదుటి వాళ్ళు చెప్పుకోవాలి. మనం అందరం తెలివి తేటలు లేవని అనుకుంటే ఇబ్బంది లేదు. తెలివి తేటలు లేకపోయినా ఉన్నాయనుకుంటున్నాం. ఇదే ప్రమాదం ఇక్కడ.

నేను తెలివైన వాడిని అని అనుకుంటున్నాను. నేను తెలివి గలవాడిని, నేను మేధావిని అనే భావనని మత్తు మందు చల్లి హరించావు. దానిని నాశనం చేశావు. నా బోధ హరించావు. నా తెలివిని తీసేసి, నా అజ్ఞానాన్ని తీసేసి వదిలేశావా? వదిలేస్తే ఎటు కాకుండా అయిపోతాను. నా అజ్ఞానాన్ని తీసేసి, నీ జ్ఞానాన్ని నాకు ఇచ్చావు. నీ బోధ కల్పించావు. నీ తెలివిని, ప్రకాశాన్ని నాకు ఇచ్చావు. నీ ఆనందాన్ని, శాంతిని నాకు ఇచ్చావు. ఓ అరుణాచలేశ్వరుడా! ఇదంతా నాకు తెలియకుండానే చేసేశావు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# శ్రీ శంకర భగవత్పాదులు

మన భారతీయ తాత్త్విక చింతనపై అత్యంత ప్రభావం చూపిన గొప్ప తత్త్వవేత్త, కారణజన్ముడు జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్యులు. ఆయనే శ్రీ శంకరభగవత్పాదులు అని కూడా పిలువబడ్డారు. క్రీ॥శ॥ 788లో కేరళ రాష్ట్రములోని కాలడి గ్రామములో శరీరం ధరించిన శ్రీ శంకరాచార్యులు, తన 32 సంవత్సరముల జీవిత కాలంలో సకల వేదాంతసారాన్ని, దాని విశిష్ఠతను ప్రపంచానికి తెలియజేసి మానవాళికి మహోపకారం చేసిన మహాత్ముడు. అట్టి శంకరునికి గురువు గోవింద భగవత్పాదులు. ఆదిశంకరులు మన దేశానికి నాలుగు దిక్కులలో బదరీ, ద్వారక, పూరి, శృంగేరిలలో శంకర మఠాలను స్థాపించి తద్వారా సనాతన ధర్మాన్ని పునరుద్ధరించటానికి బలమైన పునాదులు వేసారు. తన స్వల్ప జీవితకాలంలో ఆయన ఎన్నో వేదాంత గ్రంథాలను, భాష్య గ్రంథాలను, స్తోత్ర గ్రంథాలను, అట్లే వేదములు, ఉపనిషత్తులు, పురాణముల నుండి సారమును గ్రహించి భజగోవిందము, సౌందర్యలహరి, శివానందలహరి మున్నగు అనేక గ్రంథములను రచించారు. ఆయన జీవితం ఆత్మజ్ఞానానికి అనగా అద్వైత స్థితికి నిలువెత్తు నిదర్శనం. శ్రీ శంకరులు తమ సారగ్రంథమైన 'వివేక చూడామణి'లో మానవుడు తన స్వరూపమే అయిన సచ్చిదానందస్థితిని తానుగా అనుభవైకవేద్యం చేసుకోవడానికి అడ్డంకి అయిన అహంకార, మమకారాలను ఎలా అతిక్రమించాలో వివరించారు. సంసార ప్రతిబంధ కాలన్నింటికీ అహంకార మమకారములే మూలకారణం. మన ద్వారా జరిగే ప్రతీ పనికి నేను కర్తను, అట్లే నేను భోక్తను అని భావించడమే అహంకారం. అహంకారం అనే మిధ్యాగ్రహం నుండి విడివడిననాడే మానవుడు తన స్వరూపమే అయిన బ్రాహ్మీస్థితిని తానుగా అనుభవైకవేద్యం చేసుకుంటాడు. సద్గురువు శ్రీనాన్నగారు తరచు భక్తుల సమక్షంలో శ్రీ ఆదిశంకరులను స్మరిస్తూ, ఆయన దివ్యవాణిని భక్తులకు సరళంగా బోధించేవారు. తానే అయిన పరమాత్మ నుండి, అహంకారంగా వేరుపడటం వల్ల, జనన-మరణ రూపమైన సంసారం ఏర్పడింది. కాబట్టి గురుబోధ వల్ల, గుర్వనుగ్రహం వల్ల అహంకారాన్ని తొలగించుకొని ఆత్మగా భాసించు అన్నదే వారి బోధాసారము. శ్రీ శంకరులు తన 32వ ఏట అతి చిన్న వయస్సులో మహాసమాధి చెందారు. భారతీయ తాత్త్విక చింతనను సుప్రతిష్ఠితం చేయడంకోసం, సదాశివుడే శ్రీ ఆదిశంకరాచార్యుల రూపంలో అవతరించాడు అన్నది గురువాక్కు!

**(దిll 06-05-2022 శ్రీ శంకర జయంతి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# మన భావాలు ఎక్కడ జీవిస్తే - అక్కడే మనం జీవిస్తాము

ప్రపంచంలో ఇంత పాపం ఎందుకు ఉంది అని ఒక స్వామిని ప్రశ్నిస్తే "మంచివారికి ప్రపంచం అంతా మంచిదే, కానీ చెడ్డవారికి ప్రపంచం అంతా చెడ్డదే. జీవితం పట్ల మన వైఖరే దానికి కొలబద్ధ. ప్రతీవాడికీ సొంత కొలబద్ద ఉంటుంది. మన అనుభవం గ్రాహ్య శక్తి పెరిగే కొలదీ ఈ ప్రమాణాలు మారుతూ ఉంటాయి. మన మనస్సులో ఏదైతే ప్రతిఫలిస్తుందో దానినే మనం బయట కూడా చూస్తాము. అవిషయ వాసనలు కావచ్చు, మంచి విషయాలు కావచ్చు అన్ని విషయాల్లోనూ ఎప్పడు భగవంతుణ్ణి చూడాలి, ఎల్లప్పడూ చూడాలి. ఇక మనకు పాపం అనేది కనబడదు. అనుమానం పెట్టుకొన్న మనస్సే అన్నిచోట్ల పాపాన్ని చూస్తుంది. అందరిలోనూ భగవంతుణ్ణి చూస్తే మనస్సు మంచినే చూస్తుంది" అన్నారు. ఇంద్రియ సుఖాలు ప్రథమంలో సుఖం కనిపిస్తుంది. దానిలో తరుగుదల ఉంటుంది. తరువాత చేదుగా ఉంటుంది. పుట్టి సుఖానికి వికారం ఉంటుంది. ఆత్మసుఖం శాశ్వతమైనది. కొందరు సాధకులు తాను గాని విషయాల మీద ఆసక్తిగా ఉంటారు. శ్రీనాన్నగారు "ఏ విషయాల పట్ల మనస్సు వడిగా పరిగెడుతోందో ఆ విషయాలపట్ల మనస్సు ఉపసంహరించే వరకూ మీకు ఏ దేవుడూ సహాయం చెయ్యలేడు. రూపం, నామం వచ్చిన తరువాతే ఎట్రాక్షన్ కలుగుతుంది. తలంపు లేకపోతే కామం లేదు - కోరికలూ లేవు. శవ దృష్టి బంధిస్తుంది. శివ దృష్టి బంధించదు" అన్నారు. దేనినైతే స్మరిస్తామో దానిని ధ్యానించటం మొదలుపెడతాము. దానివల్ల మోహం జనిస్తుంది. అది రాత్రి కలలో కూడా మన వెంట వస్తుంది. మరణించేటప్పడు వాటి రూపాలే మన కళ్ళ ఎదుట నిలుస్తాయి. ఆశలు ఎక్కడో - నివాసాలు అక్కడే ఉంటాయి. దేశకాల పరిస్థితిలో మనం ఎక్కడ ఉన్నామో, ఏవిధంగా ఉన్నామో అక్కడ పరిపూర్ణంగా జీవించాలి. అంటే పరిస్థితులకు బానిస కాకూడదు. లోపల నిండుగా ఆత్మధ్యాసలో ఉండాలి అనే జాగరూకత. మనం గృహస్థ జీవితాన్ని వినోదప్రాయం చెయ్యకూడదు, శ్రద్ధ వహించాలి. సత్యాన్ని పొందాలనే పట్టుదల వహించాలి. దుఃఖ కారణం, బాధ కారణం పరిశోధించాలి, శోక కారణం పరిశోధించాలి. పరీక్షించాలి. ఇది అంతా మనస్సు గారడీ అని నిశ్చయానికి రావాలి. మనం అజ్ఞానంలో కూరుకొనిపోయాము. ప్రకృతి ఆశయం ఏమిటో పరిణామ ప్రవాహం ఏ ముఖంగా పరుగుపెడుతుందో గ్రహించాలి. మనం భగవంతుణ్ణి తెలుసుకొని తీరాలి. ఈ జీవిత సంగ్రామానికి కారణం ఆత్మసాక్షాత్కారం పొందటానికే. నా భార్య నన్ను ప్రేమిస్తున్నది అని మనం ఆమెను ప్రేమిస్తున్నాము అంటే వారిలో భగవంతుణ్ణి ప్రేమిస్తున్నాము అంతే గానీ ఆమె రూపలావణ్యాలకు, ముఖసౌందర్యాలకు, శరీర విన్యాసాలకు మోహితులై ఉండకూడదు. వివాహబంధం వియోగంతో అశాంతితో అంతమౌతుంది. ఈ పరిణామాల అంతంతో హృదయవేదన ఆందోళనలు తీరని వ్యాకులతలతో తల్లడిల్లిపోతారు. మహాపండితులు, మేధావులు దీనికి బలి అవుతారు. భార్య గాని, భర్తగాని ప్రేమించటం బోధిస్తుంది. ఆ ప్రేమలు శరీరంలో దాచిపెట్టక సమస్త విశ్వవ్యాప్తం చెయ్యాలి. ఎంతవరకైతే విషయ వస్తువు ప్రేమ ఉందో అంతవరకూ అపజయం తప్పదు. జీవిత సాఫల్యం పొందలేము. అంతే!

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**